# స్పందన

— భవానీ శర్మ, Hyderabad, AP

మాధవరావు ఆలోచనలన్నీ భగ్నం చేస్తూ అతని టేబుల్ మీద ఫోన్ మోగింది. విసుగ్గా రిసీవర్ ఎత్తి 'హలో? ఎవరు' అని అడిగాడు.

సమాధానంగా వికటంగా ఆ నవ్వు వినిపించింది. 'హలో మాధవరావు స్పీకింగ్.'

'తెలుసు మిస్టర్ మాధవరావు. ఎవరికి ఫోన్ చేసావు. రాధ ఆచూకీ తెలిసిందా?' అడిగిందా కంఠం.

'లేదు. మీరెవరు?'

'రాధని పెండ్లి ఆడి ఎంతో హ్యాపీగా సాగిపోయే ఆమె సంసారంలో కలతలు రావడానికి కారణం నేను.'

'నువ్వా శివా! ఏమిటా నవ్వు. ఎవరో అనుకున్నాను.'

'మీరు మళ్ళీ కలవాలి మాధవ్.'

'దాని వల్ల నీకేమిటి లాభం. ఆవిడ రచయిత అని తెలియదు. అందునా ఒక పవిత్రమైన భారత స్త్రీ వుసురు తప్పకుండా తగులుతుంది. నా విషయంలో ఫిలిమ్ పరిశ్రమ బాగా దెబ్బ తింది. మీతో నాకు కొద్ది పరిచయము అయిన రాధమ్మని నా తోబుట్టువులా భావించిన నాకు చెల్లెళ్ళు లేకపోవటం వల్ల నేను అన్నమాట వల్ల మీరు ఆమెని బాధిస్తారని తెలియదు. మీ యిద్దరు తెల్లగా వున్నారు. మీ బాబు నల్లగా ఉన్నాడు అన్నాను. ఆ చిన్న మాటకి నీవు ఆమెను అనుమానించి చాలా బాధపెట్టి వుంటావు. ఆవిడని మనం తప్పక కలవాలి. ఎప్పుడు వెడదాము. ఈ రోజు రమ్మంటావా.'

' వద్దు శివా. ఆమె వెళ్ళిన దగ్గర నుంచి నేను కూడా చాలా బాధ పడ్డాను. యిప్పుడు ఆవిడ నన్ను క్షమించదు. ఏమీ ఆలోచించకుండా, తొందరపడి నిర్ణయం తీసుకున్నందుకు నేను అనుభవించ వలసిందే. శివా! నా అనుమానమే నన్నీ పరిస్థితికి తీసుకు వచ్చింది. రాధని వెళ్ళకొట్టినందుకు యిల్లు నరకమయింది. నన్ను నన్నుగా మావాళ్ళు ఎవరూ ప్రేమించ లేదు. కనీసం అభిమానమూ చూపలేదు. అంతా నా డబ్బు మీద ప్రేమ. సరే శివా ఫోన్‌లో ఎందుకు. మనం నిదానంగా క్లబ్బులో కలసి మాట్లాడుకుందాము. క్లబ్బుకు సాయంత్రము రా' అని ఫోను పెట్టేసాడు మాధవరావు.

కానీ అతని ఆలోచనలు రాధ మీదకి వెళ్ళినాయి. రాధ వుండగా ఇల్లు యెంత అందంగా ఆకర్షణీయంగా వుండేది. రాధకి గులాబీలు అంటే చాలా యిష్టం. ప్రతిరోజు ఫ్లవర్ వాజ్‌లో గులాబీలు పెట్టి అందంగా, ఫోన్‌ని శుభ్రంగా తుడిచి అమర్చేది. యిప్పుడు ఫోను నిండా దుమ్ము పట్టి టేబులు తుడిచేవాళ్ళు కూడా లేరు. పుస్తకాలు దుమ్ము కొట్టుకు పోయాయి. బాబుని తనతో తీసుకు వెళ్ళింది. బాబు ఫొటో చూసినప్పుడల్లా తప్పు చేసాననిపిస్తుంది. గుండ్రని ముఖం, పెద్ద పెద్ద కళ్ళు, సొట్ట బుగ్గలు, తేనె కళ్ళు, చామనచాయ రంగు. చూపరులను ఇట్టే ఆకట్టుకుంటాడు. కిట్టూ చాలా ముద్దుగా వుంటాడు. తన డబ్బుకోసం చెల్లెలు లలిత, ఆమె భర్త యిక్కడే తిష్ట వేసారు. యెంత ఇచ్చినా యింటి ఖర్చులకు చాలటం లేదు. రాధ చాలా పొదుపుగా వాడి మిగిలిన దానితో తన పుట్టిన రోజు నాడు యేదో ఒకటి తనకి గిఫ్టుగా కొనిచ్చేది. పదేళ్ళ క్రితం కొనిచ్చిన వాచి యెంత బాగుంది. యెవరు చూసినా యెంతో బావున్నదని అంటున్నారు. వాళ్ళు అడిగి నప్పుడల్లా యెంత మర్చిపోదామన్నా రాధ జ్ఞాపకమొస్తుంది. బాబుకిప్పుడు పన్నెండేళ్ళు వుండవచ్చును. బాబు రెండేళ్ళుగా వున్నప్పుడు రాధకి, నాకు మనఃస్పర్ధలు వచ్చినాయి. యిప్పుడు యెంత అందంగా వున్నాడు. ఎవరో ఏదో అన్నారని మంచి గుణవంతురాలిని, అందమయినదానిని యింట్లో నుంచి పంపివేసిన దౌర్భాగ్యుణ్ణి. నాకు నిష్కృతిలేదు. నాకు ఇలా శాస్తి అవవలసిందే.

' అయ్యగారూ! కాఫీ!' అన్న రామయ్య పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు.

మాధవరావు రాధ అన్నగారు రవి స్టేట్స్ వెళ్ళి 10 సంవత్సరాలు అయ్యింది. ఇప్పుడు ఇండియా వస్తున్నట్లు కేబుల్ పంపినాడు మాధవరావుకి. మాధవరావు విడిపోయినట్లు రవికి తెలియదు. రేపే వస్తున్నాడు. రవికి ఏమని చెప్పాలి అని మధన పడుతున్నాడు. ఇంతలో ఫోన్ మ్రోగింది.

'హలో ! మాధవరావు స్పీకింగ్.'

' నేనురా. శివాని. నీవు రేపు తప్పకుండా క్లబ్బుకి రావాలి. మర్చిపోకు' అని ఫోన్ పెట్టేసాడు.

రాధకి రవి వస్తున్నట్లు వాళ్ళ నాన్న జగన్నాధరావు ఉత్తరం రాసాడు. ఆ జాబు చూసుకొని రాధ ఎయిర్‌పోర్టుకి బయలుదేరింది.

' హలో రవి హౌవారు యూ' అన్నది.

'రాధా, ఫైన్' అన్నాడు. రవి, రాధా కారు ఎక్కి ఇంటికి వెళ్ళారు. కారు పోర్టికో లోకి వెళ్ళింది. కారు దిగకుండానే కిట్టు వచ్చాడు. 'హలో అంకుల్' అన్నాడు. 'మా బాబు కిట్టూ' అన్నది. 'బావగారు మరి' అన్నాడు. 'ఆయనకి శలవు దొరకలేదు అందుకని నేను వచ్చాను' అన్నది రాధ. అందరూ కలసి టిఫిను తిన్నారు. యిడ్లీ చాలా బాగుంది అన్నాడు రవి. రవి వాళ్ళమ్మ సీతమ్మ, తండ్రి జగన్నాధం. అందరూ కబుర్లు చెప్పుకున్నారు. రవి రెస్టు తీసుకొనేందుకు రూముకి వెళ్ళాడు. రాధ తన విషయము యెట్లా చెప్పాలా అని మధన పడుతుంది. రెండు గంటలకి రంగన్న, చిన్నమ్మగార్ని భోజనానికి పిలిచాడు. ఆలోచనలకి స్వస్తి చెప్పి మెల్లిగా డైనింగ్ టేబుల్ దగ్గరికి వెళ్ళదామని మేడ దిగుతున్నది. ప్రక్క రూము లోంచి మాటలు వినిపించాయి. యెవరా అని ఆగి విన్నది. తన తల్లి సీతమ్మ గొంతు జీరపోయింది. యేడుపు వినిపిస్తుంది. నాకు కొంత శ్రమ తగ్గించింది అనుకొని రాధ తేలిక పడిన మనసుతో మెట్లు దిగి వెళ్ళింది ఏమి తెలియ దానికి మల్లే. అందరూ భోజనం చేస్తున్నారు. అందరూ మౌనంగా వున్నారు. ఎవరి ఆలోచన్లలో వాళ్ళు ఉన్నారు.

' రాధా! మీ ఆయన చాలా మంచివాడనుకొన్నాను. ఇలా అనుకోలేదు' అన్నాడు నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ రవి.

'అంతా పెద్దమనుషులే ఒకరికి చెప్పటానికి మాత్రం, తమ దగ్గరికి వచ్చేటప్పటికి నీతులు పనికిరావు. నా అదృష్టం అనుకోవాలి' అని నిట్టూర్చింది. 'రాధా! నీవేమి బాధ పడకు. నేను పెద్ద డాక్టర్ని. సైన్సులో లేటెస్టు పరిమాణాలన్నీ తెలుసుకొన్నవాడను. అన్నీ అవే సర్దుకొంటాయి' అన్నాడు.

అందరూ భోజనాలు అయినాయనిపించి లేచి యెవరి రూముల్లోకి వాళ్ళు వెళ్ళి పోయారు. రవి కారు తీసుకొని మాధవ్ ఇంటికి వెళ్ళాడు. మాధవ్, శివా సోఫాలో కూర్చుని మాట్లాడుకొంటున్నారు. రవిని చూసి ఇద్దరూ ఆశ్చర్యపోయారు. మాధవరావు తేరుకొని రా 'రవీ ఇదేనా రావటం' అని సాదరంగా ఆహ్వానించాడు. 'శివా నీవు ఇక్కడున్నావేమిటి. మీ ఇద్దరికి ఎన్నాళ్ళనుంచి స్నేహం. నీ ఫిలిం పరిశ్రమ ఎట్లా ఉన్నది. నీకు ఎంతమంది పిల్లలు నీలాగే వుంటారా!' అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

'ఉండరా బాబు, అన్నింటికి ఒకేసారి సమాధానం చెప్పంటే కష్టంరా రవి. నా ఫిలిం మూత పడ్డది. చాలా నష్టపోయాను. నాకు పిల్లలు లేరు.'

'బావగారూ, ఏమిటి మాట్లాడటం లేదు. మీ ఇల్లు చూసి చాలా రోజులైంది. ఒక సారి చూద్దాం రండి' అని సోఫాలోంచి లేచాడు.

రవితో పాటు మాధవరావు, శివా కూడా లేచారు. అందరూ కలసి యిల్లంతా చూసి ఆఖరికి బెడ్‌రూములోకి వెళ్ళారు. అక్కడ వున్న తైల వర్ణ చిత్రం చూస్తూ అలాగే నిలచిపోయాడు రవి.

'ఏమిటి, రవీ, అలా నిలచిపోయావు' అన్నాడు శివ.

' ఆ బాబు మన కిట్టూలాగా లేడూ' అన్నాడు.

మాధవరావు, శివ యిద్దరూ ఒక్కసారి అవును అన్నారు.

'యిదే మీ యిద్దరు విడిపోవటానికి కారణం'

అన్నాడు రవి.

' ఈ ఫొటోకి వీళ్ళు విడిపోవటానికి సంబంధం యేమిట'న్నాడు శివ.

' అవును శివా సైన్స్ ప్రకారం ఆడవాళ్ళు పడక గదుల్లో ఏలాంటి ఫొటోలు చూస్తారో వాళ్ళ మనస్సుని, ఆలోచనలన్నీ బట్టి పుట్టబోయే పిల్లలు కూడా అల్లాగే ఉంటారు. అందుకనే గర్భిణీ స్త్రీలు యెప్పుడు మంచినే ఆలోచించాలి అని పెద్దలు చెప్తూ వుంటారు. యెప్పుడు వాళ్ళని చూస్తే అలాగే వుండాలి అని అనుకొంటే వాళ్ళ మనస్సులో ప్రతి కదలిక కూడ అలాగే అచ్చు ఫొటో తీసి నట్లువుంటుంది. శివా! స్నేహం అంటే సంసారంలో విడిపోయేటట్లు చేయకూడదు. యేమన్నా లోపాలున్న కలిపేటట్లు చేయాలి అదిరా 'స్నేహమంటే' అన్నాడు రవి.

' చచ్చిన పాముని చంపకురా. క్షమించమని అడిగే అధికారం కూడా పోయిందిరా. చెల్లెమ్మకి మొహం చూపించలేను.'

'మాధవరావు లాంటి చెప్పుడు మాటలు వినే వాళ్ళు చాలామంది వుంటారు. సొంతంగా ఆలోచనా శక్తి వున్నవాళ్ళు తక్కువ' అన్నాడు రవి.

'రవీ డాక్టరు చదివావు కనుక నీకు సైన్స్ తెలుసు మాలాంటి వాళ్ళకు ఏమి తెలుస్తుంది' అన్నాడు మాధవరావు.

' నీ వల్ల మళ్ళీ మాకు మంచి రోజులు వచ్చాయి. ఇప్పటికిని మీ తప్పు తెలుసుకున్నందుకు చాలా సంతోషం బావగారు. రండి మనందరం రాధ దగ్గరికి వెళుదాము' అన్నాడు రవి.

అందరూ కారులో బయలుదేరారు. భార్యని యిన్ని రోజులకు కలుస్తునందుకు చాలా ఆనందంగా వుంది. కారు వెళ్ళి ఇంటి ముందు ఆగింది. కారులోనుంచి కొత్తవాళ్ళు దిగటం చూసి కిట్టూ యింటి లోపలికి వెళ్ళాడు. సాయంత్రం సమయం నీరెండ లాన్‌లో పడుతున్నది. లాన్స్‌లో కూర్చుని టీ తాగుతున్న రాధ అటే వస్తున్న రవిని, మాధవరావుని, శివని చూసింది. ఇంట్లోకి వెళ్ళటానికి లేచింది. 'కూర్చో చెల్లెమ్మా ఆ మాట అనటానికి కూడా అర్హత పోగొట్టుకున్నాను. నన్ను క్షమించు.'

'మీది తప్పేమున్నది అన్నయ్య మన బంగారం మంచిదయితే కంసాలిని ఎందుకు అనటం నాది తప్పు.' అన్నది రాధ.

'రాధా! నీతో నాలుగు సంవత్సరాలు సంసారం చేసిన వాడిని నీ సంగతి తెలిసి కూడా యెవరో యేదో అన్నారని నేను చేసిన పనికి నేను సిగ్గు పడుతున్నాను. నన్ను క్షమించు రాధా' అంటూ రాధ వద్దకు వచ్చాడు మాధవరావు. వాళ్ళ యిద్దరిని వంటరిగా వదలి శివ, రవి మల్లెపందిరి క్రింద కూర్చున్నారు.

'ఇందులో తప్పేముంది మనలో మనకి క్షమాపణలెందుకు?' అన్నది రాధ.

'నిజంగా నన్ను క్షమించు రాధా నేను నమ్మలేక పోతున్నాను' అని రాధని కౌగలించుకున్నాడు.

వాళ్ళిద్దరూ అలా వుండగా రాధ తల్లి సీతమ్మ, తండ్రి జగన్నాధం అటుగా వచ్చారు. కిట్టు కొత్త అంకులు వచ్చారు అని వాళ్ళిద్దరిని తీసుకు వచ్చాడు. అమ్మా అన్నపిలుపుకి ఉలిక్కిపడింది అలా ఎంతసేపు ఉన్నారో వాళ్ళకే తెలియదు. పరిసరాలు మర్చిపోయారు. 'కిట్టూ! మీ నాన్నగారు' అని కిట్టూని పరిచయం చేసింది 12 ఏళ్ళ కిట్టూని. కిట్టూని దగ్గరికి తీసుకుంటే ఏదో తెలియని అనుభూతికి లోనయ్యాడు మాధవరావు. అలా వాళ్ళని చూస్తున్న రవికి, శివకి కళ్ళనీళ్ళు కమ్ముకున్నాయి.


INVESTMENT SERVICES

DISCOUNT COMMISSIONS ON STOCKS AND BONDS



VAIKUNTA MURTY GULIVINDALA
VICE PRESIDENT
WESTMINSTER SECURITIES CORPORATION
MEMBER
NEW YORK STOCK EXCHANGE, INC. & SIPC
19 Rector Street 11th floor
New York, NY 10006
1(800) 553-6428
1(212) 480-2503
Fax: (212) 480-2549

SERVICES INCLUDE:

* Stocks and Bonds
* Bonds for Children
* Mutual Funds
* Treasuries and Tax Exempt Bonds
* IRA and Pension Plans
* Portfolio Management

* Accounts insured up to 10 million dollars.
* Commissions less than Schwab and Fidelity.
* The growth of your money is our primary interest.
* Clearing agent: Pershing/DLJ Securities